# ప్రణయమూ - పరిధి

బండిమనిషి సామాన్లు తెచ్చి స్టేషన్‌లో పెట్టేడు. ఒక సూట్‌కేసూ ఒక సంచీ అంతకన్నా మరేంలేవు. కల్పనకి వాటిని లెక్కచూచు కోవలసిన అవసరం లేకపోయింది. సామాన్ల దగ్గర నిలబడి చుట్టూ చూచింది. స్టేషన్లో అట్టే సందడిలేదు· అంతా మంచి నిద్రలో వున్నారు. కునుకు తీయడానికి కాకపోయినా, కాస్త కూచునేందుకు చోటు దొరుకుతుందేమోనని, కల్పన బెంచీలవైపు చూచింది. ఉన్నవి నాలుగు బెంచీలు. వాటిమీద బిక్షగాళ్లు, పోర్టర్లు, ప్రయాణీకులు, అంతా ఎంతో వద్దికగా పడుకుని, ఒకరి డొక్కలో ఒకరు కాళ్లు దూర్చుకొని నిద్రపోతున్నారు.

నేలమీద చతికిలబడటానికి కల్పనకు మనసొప్పలేదు. ఎంగిళ్లు, దుమ్ము, ధూళి, చెత్తకాగితాలు, అంతమురికీ అక్కడేవుంది. అంత గలీజులోనూ దుప్పట్లు పరచి నిద్రపోయేవాళ్లు నిద్రపోతూనే వున్నారు. తాను ఎక్కడ కూచోవాలో కల్పనకి బోధపడలేదు. విసుగ్గా అక్కడే నిలబడింది. చాలా చలిగా వుంది. కొంగుతీసి తలకు కప్పుకుంది. కాసేపు నిలువుగాళ్ల తపస్సు చేసేసరికి కాళ్లుపీకాయి.

"యే బండికి పోవాలమ్మా?" అక్కడున్న పోర్టరొకడు పలకరించాడు. వాడు చాలాసేపటినుంచీ కల్పన అవస్థ చూస్తున్నాడు. కల్పనకి చిరాకు తలకెక్కింది. వాడివైపు కన్నెత్తి చూడకుండానే "మెయిలుకు ఇంకా టైమెంత వుంది?" అంటూ ఎదురుప్రశ్న వేసింది. అమె యే బండికి పోవాలో పోర్టరుకు స్పష్టంగా అర్థమైపోయింది.

"అది ఇప్పుడే ఎక్కడ వస్తుందమ్మా, నాలుగు గంటలు లేటు" అన్నాడు పోర్టరు. కల్పన నీరు కారిపోయింది. దీనంగా పోర్టరువైపు చూచి "ఇప్పుడు టైమెంత?" అన్నది.

"ఇప్పుడేమయింది? పదిన్నర అయింది. అది రెండింటికి వస్తే మేలు. ఎంతసేపని ఇట్లా నిలువుగాళ్ళమీద నిలబడతారు? వెళ్ళి ఫస్ట్‌క్లాస్ వెయిటింగు రూములో కూర్చోండమ్మా" అన్నాడు వాడు.

కల్పనకి సలహా అయితే నచ్చిందికాని వెళ్ళి కూచోవడానికి సంకోచించింది. తను ఫస్ట్‌క్లాస్ ప్రయాణీకురాలు కాదు. అదీగాక ఫస్ట్‌క్లాస్ వెయిటింగు రూము ఆ స్టేషన్‌లో పురుషులకు మాత్రమే వుంది. అదైనా నిర్మానుష్యంగా వుంటే ఫరవాలేదు. మగవాళ్ళతో క్రిక్కిరిసివుంటే-వాళ్ళమధ్య కూచోవడం, అదోలావుంటుంది.

పోర్టరు కల్పన ఆలోచనల్ని పసిగట్టినట్టులేదు. సూట్‌కేసు తీసుకొని 'రండమ్మా' అని బయలుదేరాడు.

కల్పన బెరుకు బెరుగ్గానే లోపలకు అడుగుపెట్టింది. లోపల దాదాపు ఖాళీగా వుంది. ఒకేఒక మనిషి కుర్చీలో పడుకొని నిద్ర పోతున్నాడు. కల్పనకి ధైర్యం చిక్కింది. పోర్టరు సూట్‌కేస్ లోపల పెట్టి వెళ్ళిపొయ్యాడు.

కల్పన కుర్చీలో కూచోబోయి, ఎదురుగ్గా అద్దం కనిపిస్తే, వెళ్ళి అద్దంముందు నిలబడింది. అద్దంలో ప్రతిబింబం చూచుకొని తృప్తిగా వూపిరి పీల్చింది. మెడలో నగలులేవు. వంటిమీద ఖరీదయిన చీరలేదు. అయితేనేం-ముఖంలో ఏదో కళ కొట్టవచ్చినట్టు అగుపడుతోంది. తన నిరాడంబరతలోకూడా ఏదో ఆకర్షణ వుంది! అందుకు సందేహంలేదు. దాఖలాగా కల్పన, ఇందాకా తన్ను అక్కడ విడిచిన పోర్టరు విషయం మననం చేసుకుంది. స్టేషన్‌లో సవాలక్షమంది స్థలంలేక, ఇబ్బందిగా నిలబడి వుంటారు. అందర్నీ పోర్టర్లు కలుగజేసుకొని ఫస్ట్‌క్లాసు వెయిటింగు రూములో తెచ్చి వదలరు. తనలో యేదో ప్రత్యేకత వుంది. అది యిట్టే ఆకర్షిస్తుంది మనుషుల్ని.

కల్పన తృప్తిగా మరోసారి వూపిరిపీల్చి, కుర్చీలో కూచుంది. చటుక్కున ఆమెదృష్టి. కుర్చీలో కూచొని నిద్రపోతున్న యువకుని మీద పడింది. పాతికేళ్ళకన్నా ఎక్కువ వుండవు. సున్నగా గడ్డం గీసుకున్నాడు. నీటుగా వున్నాడు. కూచునే ఆదమరచి నిద్రపోతు న్నాడు. అతను అలా నిద్రలో మునిగివుండటం కల్పనకి సంతోషం కలుగజేసింది. ఏ సంకోచం లేకుండా తనుకూడా ఒక చిన్న కునుకు తీయవచ్చు.

కల్పన బద్ధకంగా ఆవులించి కుర్చీలో వెనక్కి జేరగిలబడ్డది. కనురెప్పలు మూతలు పడుతున్నాయి. అనుకోకుండా ఆమెదృష్టి టేబిల్‌మీదున్న జిప్‌బాగ్‌మీద నిలిచింది. సంచికి అంటించిన కాగితం మీద టైపు అక్షరాలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. కల్పన కొంచెం ముందుకు వంగి, పరీక్షగా అక్షరాలవైపు చూచింది. వి. కె. రావ్, ఎం.బి.బి.ఎస్. అన్న పొడి అక్షరాలు కన్పించాయి. ఈసారి కల్పన పడుకున్న యువకునివైపు తదేకంగా చూచింది. అతని ముఖంలో కొట్టవచ్చినట్టు డాక్టరు లక్షణాలు కన్పిస్తున్నాయి. హుందాగా, అందంగా కనిపిస్తున్నాడు, చిన్నవయసులోనే డాక్టరు పాసయ్యాడు. అవును మరీ చిన్న వయసు. ఇంకా పెళ్ళికూడా అయిందో లేదో.

పెళ్లి అన్న ఆలోచన, కల్పన మనస్థితిని కొంచెం గజిబిజి చేసింది. కళ్ళమీదున్న నిద్ర ఎగిరిపోయింది. అస్థిమితంగా కుర్చీలో, అటూ ఇటూ కదిలింది. కడకు యేమీ తోచక గోడకేసి చూస్తూ కూచుంది. గోడమీద పరిమిత సంతానాన్ని ప్రచారం చేసే బొమ్మ చూడముచ్చటగా వుంది. తనకు నచ్చినంత మందిని మాత్రమే కనే అవకాశం స్త్రీకి అందుబాటులో వుంది. తను మెచ్చినవాణ్ణి చేసుకొనే అవకాశం స్త్రీకి అందుబాటులో వుంటే ఎంత బాగుండును అను కున్నది కల్పన.

కల్పన ఆలోచనలు తటుక్కున పెళ్లిళ్ల మీదికి వెళ్ళాయి. ఈ దేశంలో యువకులకీ, విద్యావంతులకీ, స్త్రీలను ప్రేమించడం తెలి

యడు. డబ్బును ప్రేమించడం తెలుసు. వాళ్ళ ఆలోచనలు ఎప్పుడూ డబ్బుచుట్టూ, అంతస్థు చుట్టూ పరిభ్రమిస్తాయి. అందానికీ, అనురాగానికీ, అణా విలువలేదు! పాతిక వేలుంటే పనికిమాలిన పల్లెటూరి పిల్లకు డాక్టరు మొగుడుగా దొరుకుతాడు. డబ్బులేకపోతే, అందమూ చందమూ, అన్నీ దుమ్ము కొట్టుక పోవలసిందే - ఎవడికీ అక్కర్లేదు. మనిషీ, ప్రేమా, అన్నీ మార్కెట్టు వస్తువులయ్యాయి! ఎప్పుడు బాగు పడుతుంది ఈ దేశం!

కల్పన విరాగ్గా - కుర్చీలో మసిలింది. మళ్ళీ ఆమెదృష్టి గోడ మీదున్న బొమ్మమీద పడింది. ప్రభుత్వం అన్నీ తలతిక్క పనులు చేస్తూ వుంటుంది. ఈ ప్రచారం కొరకు వేలకువేలు డబ్బు తగలేస్తూ వుంది. సంతానం విషయం దేవుడెరుగు! తనలాటి ఆడపిల్లలు, మొగుళ్లు దొరక్క మొత్తుకుంటున్నారు. ఆడబిడ్డల కన్న తండ్రులు - అల్లుళ్ళడిగే కట్నాలివ్వలేక అగచాట్లు పడుతున్నారు. ఈ సమస్యల పట్ల శ్రద్ధ చూపదేం ప్రభుత్వం? కట్నాలడిగే వాళ్ళని, కటకటాల్లో తోస్తే ప్రభుత్వం సొమ్మేం పోతుంది?

కుర్చీలో పడుకున్న యువకుడు కొంచెం కదిలాడు. ఆ కదలికకు కూర్చున్న కుర్చీ కిర్రుమని శబ్దం చేసింది. కల్పన చూపులూ, ఆలోచనలూ డాక్టరు మీదికి మళ్ళాయి. అతడు నిశ్చింతగా నిద్ర బోతున్నాడు. నిద్రలోనే అతడు కాళ్లుతీసి టేబిల్‌మీద పెట్టాడు. కల్పన అతన్ని నఖశిఖ పర్యంతం పరీక్షగా చూసింది. తలకు చుట్టుకున్న మఫ్లర్ జారి కింద పడిపోయింది. ఫాను గాలికి క్రాపు వెంట్రుకలు సన్నగా కదలాడుతున్నాయి. మెడదగ్గర ప్లాకు గుండీ వూడి, లోపలి బనియన్ కనిపిస్తూ వుంది. విశాలంగా, ధృఢంగా వున్న రొమ్ము, దానిమీద దట్టంగా మొలిచిన వెంట్రుకలు!

ఎందుకో కల్పనకి కాస్త వళ్ళు పులకరించింది. అరమోడ్పుగా కళ్లు మూసుకుంది. ఆమెలో యేవో తియ్యటి భావనలు తేనెటీగల్లా ముసురుకున్నవి. కల్పన తన్నుతాను డాక్టరు భార్యగా వూహించు

కుంది. ఆ వూహ ఆమెకి అమితమైన ఆనందాన్ని ఇచ్చింది. దాంతో కల్పన వూహాలోకంలో మరోఅడుగు ముందుకువేసింది. కల్పన మెల్లగా వెళ్ళి, కిందపడ్డ మఫ్లర్ తీసి తలకు చుట్టింది. బాగ్‌లోంచి వులెన్ రగ్గుతీసి, డాక్టరు వంటిమీద కప్పుతున్నది. డాక్టరు కళ్ళు తెరిచాడు. మత్తుగా కల్పన చేతులు అందుకుని మీదికి లాక్కుంటున్నాడు. కల్పన సన్నగా నవ్వుతూ, విడిపించుకోవడానికి ప్రయత్నంలాంటిది చేస్తూనే, అతని మీదికి వొరిగింది. వెచ్చటి స్పర్శ! కల్పన నున్నటి ముఖంమీద బిరుసయిన అతని ముఖం తారాడి - గిలిగింతలు పెట్టింది.

కల్పన కళ్లుమూసుకొనే గుటకలు మింగింది. కళ్ళు తెరవాలనిపించలేదు. మరో వూహాదృశ్యం సృష్టించడానికి - వస్తువుకోసం ప్రయత్నిస్తోంది. ఉన్నట్టుండి డాక్టరు, ఉలిక్కిపడ్డట్టులేచి, నిటారుగా కూర్చున్నాడు. ఆ శబ్దానికి కల్పన, కల్పనా జగత్తు కాస్త పాడయిపోయింది. ఆమె నాజూగ్గా కనురెప్పలు తెరిచింది. కల్పన కళ్ళు విప్పడంచూచి అతను ఆత్రంగా "ఏమండీ ఇంకా మెయిలు రాలేదు కదా?" అన్నాడు.

కల్పన మందహాసం చేసి, రాలేదన్నట్టు అందంగా తల తిప్పింది. అతను సంతృప్తిగా నిట్టూర్చి, ముఖం కడుక్కోవడానికి లోనికి వెళ్ళాడు.

అతడు మెయిలును గూర్చి ప్రశ్నించడం కల్పనకి సంతోషం కలుగజేసింది. అంటె తనతోపాటూ, అతనూ మెయిల్లోనే ప్రయాణం చేస్తాడన్నమాట! కల్పన ముఖంమీద వెలుగు తొంగిచూచింది! కల్పన ప్రతి నరంలోనూ రక్తానికి బదులు ఆశ ప్రవహిస్తున్నట్టు వున్నది! కొన్ని చిన్నచిన్న సంఘటనలే జీవితాల్ని మారుస్తాయి. ఎవరి అదృష్టం ఎలావుందో ఎవరు చూడొచ్చారు? ప్రయాణాల్లోనూ, టీపార్టీల్లోనూ, కలిగిన పరిచయాలు పెళ్ళిళ్ళకు దారితీయడం తా నెరుగును! తనకుమాత్రం అలాటి అదృష్టం పట్టకూడదని

ఎక్కడుంది? కలిసివచ్చే రోజులుండాలేగాని అదృష్టం అనుకోకుండా వరిస్తుంది!

కల్పన ధ్యానంలో మునిగిపోయింది. హృదయంలో యేదో సందడి! బంగళా, కారు, నగలు, ఖరీదయిన చీరెలు అన్నీ కలగా పులగంగా కళ్ళముందు మెదలుతున్నాయ్.

అతడు కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ వచ్చి, అద్దం ముందు నిలబడ్డాడు. నింపాదిగా తన ప్రతిబింబం చూసుకున్న తర్వాత దువ్వెనతీసి తల దువ్వుకుంటున్నాడు. కల్పన సర్దుకొని కూచుంది. ఆమెలో ఉద్వేగం, ఉత్సాహం ఉరకలు తీస్తున్నాయి. అతనితో మాటలు కలపమని, మనసు తొందర చేస్తోంది!

ఇంతలో పోర్టరు దాపురించాడు. "బండి ల్లాకయిందమ్మా. టికెట్లు ఇస్తున్నారు తెమ్మంటారా?" అన్నాడు.

కల్పన గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. ఆ వచ్చే రైలు ఇంకో గంట లేటుగావస్తే ఎంత బాగుండేది! కల్పనకి ఎక్కడలేని నిస్పృహ కలిగింది. పర్సులోంచి డబ్బు తీసింది. యే తరగతి టికెట్టు కొనా లన్నది కల్పనకి సమస్యయి కూర్చున్నది. అతను మొదటి తరగతి టికెట్టు తీసుకుంటాడేమో! కల్పనకి సాహసం చెయ్యక తప్పలేదు. ఫస్ట్‌క్లాస్ టికెట్టుకి డబ్బిచ్చి, వెళ్ళవలసిన వూరుపేరు చెప్పింది. పోర్టరు వెళ్ళాడు.

"బళ్లారి మీ స్వంతవూరా అండీ?" అన్నాడు ఆ యువకుడు కుర్చీలో కూచుంటూ.

కల్పన ముఖం విప్పారింది. మనసు తేలిక పడ్డట్టుకూడా అయింది. చొరవ తీసుకొని మాటల్లోకి దిగడం శుభసూచకంగా కన్పించింది.

"స్వంతవూరు కాదండీ! అక్కడ ఉద్యోగం చేస్తున్నాను."

కల్పన కంఠంలో కలుపుగోలుతనం ప్రతిధ్వనించింది.

యువకుడు "అలాగా" అన్నాడు.

తనవూరూ, పేరూ, చదువూ, చేస్తున్న ఉద్యోగం, పెళ్లికాని విషయం, అన్నీ చెప్పడానికి కల్పన మనసు ఉబలాటపడుతోంది. కానీ సందర్భం లేకుండా, వాగడంవల్ల, అవతల వ్యక్తి, అపార్థం చేసుకొనే అవకాశం ఉన్నది.

కల్పన చడీ చప్పుడూ లేకుండా కూర్చున్నది, అతను కల్పన వైపు చిలిపిచూపులు చూస్తున్నాడు, అట్లా తనవైపు చూస్తున్నది. యే అల్లాటప్పావాడో అయితే, కల్పనకి వంటిమీద తేళ్లూ, జెర్రులూ ప్రాకినట్టుండేది. ఇప్పుడలాంటిదేం లేదు. కళ్లూ కళ్లూ కలపడానికి కూడా కల్పన సంసిద్ధంగానే వుంది. కానీ సిగ్గు తెరలు అడ్డొచ్చాయి. చెక్కిళ్ళు ఎరుపెక్కాయి. సిగ్గుపడుతూనే పైట సర్దుకుంది. పాదాల్ని చీరె కుచ్చెళ్ళ చాటున దాచుకుంది. అరవై సెంటిమీటర్ల జాకెట్టు గుడ్డ, దాచిన భాగం కంటే, దాచని భాగమే ఎక్కువ వుంది కల్పన వంటిమీద. అక్కడల్లా ఆ డాక్టరు చూపులు పడుతూనే వున్నాయి. గిలిగింతలు పెడుతూనే వున్నాయి.

కల్పన ధైర్యంచేసి తలకొంచెం పైకెత్తింది. తప్పుచేసి పట్టుబడ్డ వాడిలా అతడు తల పక్కకి తిప్పుకున్నాడు. కల్పన మంద హాసం చేసింది.

"చాలా చలిగా వుందండీ ఇవ్వాళ" కల్పన చలిని అభినయించింది. కల్పన చొరవకు ఆ యువకునికి ఆశ్చర్యం కలిగింది.

"అవునండీ చాలా చలిగావుంది" అని వంతపలికాడు అతను. కాసేపు కళ్లూకళ్లూ కలిశాయి. డాక్టరు కళ్ళు యేం మాట్లాడుతున్నాయో

కల్పనకి స్పష్టంగా బోధపడుతూనే వుంది. అయినా తనకేం అర్థం కానట్టు అమాయకంగా చూచింది.

పానకంలో పుడకలాగా, పోర్టరు టికెట్టు తెచ్చి, "రండమ్మా బండి వస్తోంది" అన్నాడు. శుభవేళని కాస్త వాడు పాడుచేశాడు. కల్పనకి చిరాకెత్తుకొచ్చింది. 'సూట్‌కేసూ సంచీ తీసుకొని నువ్వుపద నేనూ వస్తున్నాను వెనకాలే' అన్నది.

పోర్టరు, సూట్‌కేసూ. సంచీ తీసుకొని గబగబా బయటికి నడిచాడు. కల్పన లేచి నిలబడి. చీరె సర్దుకుంది. అతనూ లేచి నిలబడ్డాడు. అతనిలో యేదో ఉత్సాహం ఉరకలు వేస్తోంది. మెల్లగా కల్పనని సమీపించాడు. కల్పన కొంచెం పక్కకి తప్పుకుంది. ఆ మానవుడు, సాహించడమా, మానడమా, అన్న సంధిగ్ధావస్థలో పడినట్టుంది. అలాగే నిలబడ్డాడు.

"మీరు టికెట్టు కొనరా?" అన్నది కల్పన. అతని ముఖంలో నిరాశ తొంగిచూచింది. మాటల్లో అమితమైన నిస్పృహను వ్యక్తం చేస్తూ "నేను మెయిల్లో రావడం లేదండీ, మా డాక్టరుగారు, ఈ మెయిలో వుంటారు. ఆయనకి ఈ జిప్‌బాగ్ అప్పచెప్పాలి" అన్నాడు.

"మీరు?"

"డాక్టరు దగ్గర కాంపౌండర్ని."

కల్పనకి తల తిరిగిపోయింది. తన సర్వస్వం ఎవరన్నా దోచుకుంటే కలిగే బాధ, ఆమె ముఖంలో వ్యక్తమయింది. ఎదురుగా నిలబడివున్న అతన్ని చూస్తోంటే కల్పనకి అమితమైన జుగుప్స కలిగింది. ఆమె గబుక్కున తల పక్కకి తిప్పుకుని, బయటకు నడుస్తోంది. అతను బెరుకు బెరుగ్గా ఆమె చెయ్యి పట్టుకున్నాడు. కల్పన అసహ్యంగా పురుగును విదిలించినట్టు విదిలించి, బయటకు

పరుగెత్తింది. ఆమెలోని ఆకస్మిక మార్పుకు అతడు చకితుడై, ఆమె వెళ్తున్న వేపు చూస్తూ వుండిపోయాడు. ప్లాట్‌ఫారమ్ మీదికి వచ్చి నిలబడ్డ కల్పనకి, స్టేషన్‌లో ఆగిన మెయిలు, చుట్టూవున్న జనం, తన్ను పిలుస్తూవున్న పోర్టరు యేమీ కన్పించలేదు! అంతా శూన్యంగా వుంది!!

——